

వేగంగా భూగర్భ డ్రెయినేజీ పనులు : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు : నగర వ్యాప్తంగా అన్ని గృహాలు భూగర్భ డ్రైను కనెక్షన్ కు అనుసంధానం అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎల్ అండ్ టి కంపెనీ, మెగా కంపెనీ ప్రతినిధులు, పబ్లిక్ హెల్త్ అధికారులు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వారాంతపు సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ పనులను వేగవంతం చేయాలని, అన్ని గృహాల డ్రెయినేజీ కాలువలను భూగర్భం ద్వారా అనుసంధానం చేసి మురుగు నీటి శుద్ధి కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ.రామ్ మోహన్ రావు, ఈ.ఈ.లు శేషగిరిరావు, రహంతూజాని, ఏ.ఈ.లు ఉన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ఔను వారిద్దరు ఇష్టపడ్డారు..!

◆సుకుమార్ చూపు టిడిపి వైపు ◆అవినీతిలో 'కావలి' టాప్

◆ప్రభుత్వ భూమి...ప్రజల భవిష్యత్తు నేతల చేతిలోనే

కావలి నియోజకవర్గం గత వైసిపి ప్రభుత్వం నుంచి అవినీతిలో టాప్‌లో కొనసాగుతూనే ఉంది.. గ్రావెల్ దందా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం... ప్రభుత్వ భూమి ఆక్రమణలు...అధికారులకు బెదిరింపులు...బరితెగించారనే విషయం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది... అప్పటి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎం. సుకుమార్‌రెడ్డిలు కలిసి దందా చేశారని కావలిలో అందరినోట ఇదే మాట... వీరి అవినీతి, అక్రమాలకు ఐఎఎస్ అధికారులు బలైపోయారు. 120 ఎకరాల ప్రభుత్వ భూమి దురాక్రమణ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ప్రస్తుత ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి రికార్డులు చూపిస్తున్నారు. రాజకీయాల్లో అప్పుడు ఏం జరుగుతుందో ఎవరికి తెలీదు. ఇప్పుడు ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, సుకుమార్‌రెడ్డిలు కలవడానికి వీరిద్దరు ఇష్టపడినట్లు ప్రచారం సాగుతోంది. సుకుమార్‌రెడ్డి టిడిపి వైపు చూస్తున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి. అవినీతి బాగోతాలు నేతలు బయట పెట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కావలి నియోజకవర్గం గత ప్రభుత్వంలో రికార్డు సృష్టించింది. అప్పటి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి వారి అనుచరులు అవినీతిలో చెలరేగిపోయారు. అక్రమ గ్రావెల్ రవాణా, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, జగనన్న కాలనీలకు ప్రభుత్వ నిధులు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. ఈ విషయంలో ఓ ఐఎఎస్ అధికారి అడ్డుచెప్పారని ఏకంగా సిఎం కార్యాలయంలోనే పంచాయతీ పెట్టించారు. కేవలం ఎకరా రూ.15 లక్షలు విలువ చేసే భూమికి ఏకంగా రూ.45 లక్షలు బిల్లు చేసుకున్నారు. ఐఎఎస్ అధికారి అడ్డుచెప్పారని, ఆయను పంపి , జెసి వద్ద ఫైల్‌పై సంతకం పెట్టించారు. ఈ వ్యవహారం వంద ఎకరాలు పైనే సాగింది. కావలి చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ మొత్తం ఈ నేతల కనుసైగల్లోనే సాగిందని చెబుతారు. ఏకంగా ప్రభుత్వం భూమి 120 ఎకరాలు అక్రమించి లేవుట్స్ వేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకోవడంలో జిల్లాలోనే కావలి నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది. అప్పట్లో టిడిపి నేతలు ఎంఎల్ఎ, సుకుమార్ అవినీతిపై ఆందోళనలు నిర్వహించారు. రాజకీయ వివాదాలు ఎలా ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగా యనేది కావలిలో కథలు కథలుగా చెప్పు కున్నారు. నేతల అవినీతి, అక్రమాలకు కావలి నియోజకవర్గ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు తలలు పట్టుకున్నారని చెబుతారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి, బయటపెడతామని హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.



కావ్య కృష్ణారెడ్డి, ఎంఎల్ఎ

ఎం. సుకుమార్‌రెడ్డి (వైసిపి బహిష్కరణ నేత)

'కావ్య' మౌనం ఎందుకు..?

కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి గత ఎన్నికల్లో చివరిలో కావలి నియోజకవర్గంలో దృష్టిపెట్టారు. ఆయన ప్రచారంలో ప్రధాన ప్రచార హస్తంగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి అవినీతిని చెప్పుకొచ్చారు. గ్రావెల్ దందా, 120 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించి, సుమారు రూ.600 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, కావ్య కృష్ణారెడ్డి రికార్డులు బయటపెట్టారు. కావలి ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్ పక్కా రికార్డులు మీడియా ముందు పెట్టారు. ఇప్పుడు కావ్య కృష్ణారెడ్డి ఈ విషయంలో నోరు మెదపడం లేదు. వైసిపి చేసిన అవినీతికి అడ్డుకట్ట వేసి, టిడిపి మంచి పాలన అందిస్తుందని ఆందరూ ఆశపడ్డారు. ఇప్పుడు టిడిపి నేతలు వైసిపి నేతల అడుగుజాడల్లోనే నడుస్తున్నారనే ప్రచారం సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గత ప్రభుత్వంలో వైసిపికి వంతపాడారు. ఇప్పుడు టిడిపి దరికి చేరారనే తెలుస్తోంది. నేతల అవినీతి, అక్రమాలకు కావలి ప్రజలు బలిపశువులు అవుతున్నారని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన వెంటనే అంతు చూస్తానని చెప్పిన ఎంఎల్ఎ పదినెలలు గడుస్తున్నా ఎందుకు మౌనంగా ఉన్నారనే చర్చసాగుతోంది.

ఔను వారిద్దరు ఇష్టపడ్డారు..!

కావలి మాజీ ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాపకుమార్ రెడ్డిని అవినీతి చేయొద్దంటు తానే నిలుపుదల చేశానని, నా లాంటి ఉత్తమైన నాయకులు కావలిలో లేరని ఇటీవల సుకుమార్‌రెడ్డి మీడియాకు తెలిపారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గత ప్రభుత్వంలో చేసిన అవినీతి, అక్రమ మద్యం, గ్రావెల్ అంతా ఆయనే చేశారని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన వివరాలు అంతా తనవద్ద ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. ఇప్పటి రెండుసార్లు వైసిపి నుంచి సుకుమార్‌రెడ్డి సస్పెండ్ అయ్యారు.కావ్య కృష్ణారెడ్డి, సుకుమార్‌రెడ్డిలు సమీప బంధువులు. పార్టీ ఓటమి తర్వాత ఆయన టిడిపి వైపు చూస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కొందరు నాయకులు దీనిని వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. ఎంఎల్ఎ ఒప్పుకుంటే అంతా ఒకే. ఇప్పుడు పార్టీలో చేరిన వ్యతిరేకత వస్తుందనే భావనతో ఆయన చేరికను నిలుపుదల చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఎంఎల్ఎ, సుకుమార్‌రెడ్డి మధ్య రహస్య ఒప్పందం కుదిరిందనే తెలుస్తోంది. కార్యకర్తల అబీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని సుకుమార్‌రెడ్డి చెబుతు న్నారు. గత వైసిపి ప్రభుత్వ అవినీతిని బయట పెట్టాలంటే అందులో సుకుమార్‌రెడ్డి ఉంటారు. ఎంఎల్ఎ ఈ వివాదంలో ఎందుకు దూరంగా ఉంటున్నారో తెలియడం లేదు. ఎంఎల్ఎ మౌనం వెనుక రహస్యలు అర్థంకావడం లేదని ఆపార్టీ నేతలం టున్నారు. ఇద్దరి నేతల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి....

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు 26వ వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కొనుగోళ్ల ప్రారంభించారు. పొగాకు వేలాన్ని బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్ పరిశీలించారు. వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు ధర రూ. 280 పలికింది. ఈ వేలం కేంద్రం పరిధిలోని పొన్న లూరు మండలం, తిమ్మపాలెం రైతులు 18 బెల్లు వేలానికి తెచ్చారు. వాటిలో 18 బెల్లు కొనుగోలు చేశారు. 280 రూపాయల సరాసరి ధర పలికినట్లు వేలం నిర్వహణ అధికారి ఎమ్. కిరణ్ తెలిపారు. ప్రస్తుతం లభిస్తున్న ధరలు గిటుబాటు కావని రైతులు తెలిపారు.సాగు ఖర్చులు బారీగా పెరిగినందున వ్యాపారస్తులు ధరలు పెంచాలన్నారు.

వేలం కేంద్రంలో కొనుగోళ్లు జరుగుతున్న దృశ్యం

ఇంటింటా చెత్త సేకరణ

ప్రజాశక్తి -సైదాపురం : మండలంలోని సైదాపురం గ్రామపంచాయతీలో సోమవారం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. సైదాపురం గ్రామం పంచాయతీ కార్యదర్శి శశి ఇంద్రాణి మాట్లాడుతూ గ్రామ ప్రజలు చెత్తను రోడ్ల పక్కనే కాలువలో వేయకుండా ఇంటి వద్దనే తడి,పొడి చెత్తగా వేరు చేసుకుని పంచాయతి నుంచి వచ్చే క్లాప్ మిత్రలకు ఇవ్వాలని తెలిపారు. తద్వారా వీధులు శుభ్రంగా ఉంటాయన్నారు.గ్రామఉప సర్పంచ్, బోలిగర్ల శివకుమార్ యాదవ్, క్లాప్ మిత్రాలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'బీద' రెండు సెట్లు నామినేషన్ దాఖలు

కూటమి నేతలు హాజరు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఎంఎల్ఎ కోటా ఎంఎల్‌సి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ సోమవారం అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల నామినేషన్ల సమర్పించారు. తొలి సెట్ నామినేషన్‌ను మంత్రులు నారా లోకేష్ , కింజారపు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్ తో పాటు బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజుతో కలిసి అందజేశారు. రెండో సెట్ నామినేషన్ సెట్‌ను జిల్లా ఎంఎల్ఎలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ పాశం సునీల్ కుమార్, కావ్య కృష్ణారెడ్డితో కలిసి వెళ్లి అందజేశారు. ఎంఎల్‌సి ఎన్నిక లాంచనీయమే కావడంతో నెల్లూరు జిల్లా నుంచి వెళ్లి ఆపార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయకు శుభాకాంక్షలు తెలిపారు. రవిచంద్ర రెండోసారిగా ఎంఎల్‌సిగా శాసనమండలిలో అడుగుపెట్టనున్నారు.

కూటమి నేతలతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తున్న బీద రవిచంద్ర యాదవ్

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన

హామీలను అమలు చేయాల్సిందే..!

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసు వద్ద అంగన్వాడీలు సోమవారం ధర్నా, మానవహారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్ధేశించి సిఐటియు ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు ఎస్ ఎ గౌస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చెప్పుల్లో ఈ కూటమి ప్రభుత్వం కాళ్లు పెట్టి నడుస్తుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా ఇచ్చిన హామీని అమలు చేయకుండా వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని విమర్శించారు. సిఐటియు నాయకులు డిఎం రాయుడు, కందుకూరు ప్రాజెక్టు లో ఉన్న ఆరు సెక్టార్ల నుండి టీచర్లు , ఆయాలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు అమలుపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 12 నెలల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రకటించిందని చెప్పారు. ఆ మేరకు ప్రతినెల మూడో శనివారం జిల్లాలో ఆయా శాఖల పరిధిలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి నెలా ప్రభుత్వం నిర్దేశించిన స్వచ్ఛాంధ్ర థీమ్ మేరకు ఆ నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ముందుగానే ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు యాక్షన్ ప్లాన్ ను ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కు ముందుగానే అందించాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్వచ్ఛాంధ్ర పై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ ఉదయభాస్కరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డి ఆర్ డి ఏ, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు నాగరాజుకుమారి, గంగాభవాని, వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, డిఇఒ బాలాజీ రావు, డిటిసి చందర్, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, జిల్లా సర్వే అధికారి నాగ శేఖర్ ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళశాల పరీక్షా కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ నాగూర్ వలీ తెలిపారు. సోమవారం ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 403 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 18 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా నిర్వహిస్తున్నట్లు ఎస్ పి. ఎస్ 5 నెల్లూరు జిల్లా డిస్ట్రిక్ట్ ఎక్సమినేషన్ కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారని అయన తెలిపారు. జిల్లా పరీక్షల పరిశీలకుడు పి. వేణుగోపాల్, ప్రిన్సిపాల్ కే.కొండయ్య, లెక్చరర్ , ఫ్లైయింగ్ స్క్వాడ్ మెంబెర్ సి హెచ్ శ్రీనివాస్ రావు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు .పరీక్ష కేంద్రం డిపార్ట్మెంటల్ అధికారి కే.వీ. నరసింహం, చీఫ్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్ వలీ సెంటర్‌లో ఎటువంటి సమస్యలు లేవని తెలిపారు.

నాగూర్‌వలి, ప్రిన్సిపాల్

కందుకూరు పోలీస్‌స్టేషన్‌కు

శ్రీ ప్రతిభ మహిళా కళాశాల విరాళం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ ప్రజల భద్రతా చర్యల్లో భాగంగా శ్రీ ప్రతిభ మహిళా కళాశాల కందుకూరు పోలీస్ స్టేషన్‌కు రూ.18,000 విలువైన సిసి కెమెరాను విరాళంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి సి. వి. సుబ్రహ్మణ్యం, సిఐ కె. వెంకటేశ్వరరావు, టౌన్ ఎస్ఐ వి. సాంబశివయ్య పాల్గొన్నారు. శ్రీ ప్రతిభ గ్రూప్స్ సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ ప్రజా సేవలో భాగంగా మన బాధ్యతగా భావించి ఈ విరాళాన్ని అందజేశామన్నారు. సిసి కెమెరాలు పోలీస్ విభాగానికి ఉపయోగపడటమే కాకుండా ప్రజలకు మరింత భద్రతను అందించేలా ఉంటాయన్నారు. భవిష్యత్తులో తాము సమాజానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ముప్పరాజు హారిక మాట్లాడుతూ మహిళల భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీస్ విభాగానికి మా వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందించామన్నారు. పోలీస్ అధికారులు, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సిసి కెమెరాను విరాళం అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : ఫిబ్రవరి 22వ తేది ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో నిర్వహించిన యూనివర్సిటీ హ్యాండ్ బాల్ అంతర్ కళాశాలల పోటీలలో కందుకూరు టిఆర్‌ఆర్ ప్రథమ స్థానం సాధించి , ఏడుగురు విద్యార్థులు యూనివర్సిటీ హ్యాండ్ బాల్ మెన్ టీమునకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 28న నుంచి మార్చి 4వ తేది వరకు పెరియార్ యూనివర్సిటీ సేలం లో జరిగిన సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీల హ్యాండ్ బాల్, మెన్ టోర్నమెంట్లో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తరపున పాల్గొని కళాశాలకు క్రీడా విభాగంలో మంచి పేరు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ ఎం రవి కుమార్, వైస్ ప్రిన్సిపల్ .నరేంద్ర ఏడుకొండలు, ఐక్యూ కో – ఆర్డినేటర్, రాజగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ కె.ఆర్. కరుణ కుమార్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సావిత్రి బాయి పూలేకు ఘన నివాళి



పూలే విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు

సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాల లేసి నివాళి అర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి శివకుమారి. షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. రోజుల్లో మహిళలు ఎంతో వెనుకబడి ఉన్నారని , బాల్య వివాహాల వల్ల మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా ,అగమ్య గోచరమైనటువంటి జీవితాన్ని అనుభవిస్తూ అనేక అవమానాలకు గురి అవుతున్న అంశాన్ని గుర్తించిన మహోన్నతురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. ఐద్వా నగర అధ్యక్షురాలు ఎన్. వి. సుబ్బమ్మ మహిళల సాధికారతే తమ ధ్యేయమంటూ మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమాన్ని మరిచిపోతున్నారని విమర్శించారు. మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ శంషాద్. నగర నాయకులు నాగలక్ష్మి. షేక్ రెహనూమ ఉన్నారు.

కొండాయిపాలెంలో..

కొండాయపాలెంలో : నగర పాలక ప్రాథమిక పాఠశాల లో ఘనంగా భారతీయ సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రి భాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు విద్యార్థులతో కలిసి ఆమె చిత్ర పటానికి నివాళి అర్పించారు. సావిత్రీబాయి పూలే సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు హరీష్ సోమేశ్వర రావు విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరులోని వైసిపి కార్యాలయంలో..

వైసిపి కార్యాలయంలో

ప్రజాశక్తి-కందుకూరు : భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళలకు మొదటి పాఠశాల స్థాపించిన సంఘసంస్కర్త, మహిళా చైతన్య మూర్తి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైసిపి నాయకులు షేక్ రఫీ,వల్లూరి కోటేశ్వర రావు,గణేశం గంగిరెడ్డి,రావులకోల్లు బ్రహ్మానందం, కరేటి సుబ్బారావు,వై నాగభూషణం ఉన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని కరేడు రామకృష్ణాపురంలో ఆక్రమణకు గురైన గిరిజనుల శ్మశాన స్థలంలో ఆక్రమణలను తొలగించి, తక్షణమే హద్దులు ఏర్పాటు చేయాలని జీ.వి.బీ కుమార్ తెలిపారు. సోమవారం ఉలవపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు.అనంతరం తహశీల్దార్ వి. లావణ్యకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 17 వరకు ప్రజా చైతన్య యాత్రలు చేపట్టామని, ఈ సందర్భంగా మా దృష్టికి రామకృష్ణాపురం గిరిజనుల శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని గిరిజనులు తెలిపారని పేర్కొన్నారు. శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన రైతులపై చర్యలు తీసుకొని, ఆ స్థలాన్ని సర్వే చేయించి హద్దులు చూపించాలని అధికారులను డిమాండ్ చేశారు.ఈ ధర్నాకు సిపిఎం ఉలవపాడు మండల సీనియర్ నాయకులు కామ్రేడ్ పొన్నం. రామ లక్ష్మమ్మ, ఆ పార్టీ నాయకులు మల్లవరపు అంకమ్మరావు, కత్తి వెంకటేశ్వర్లు, వీసం సుభాషిణి, మాణికల భాస్కర్, కత్తి జ్ఞానయ్య, రత్నకుమారి, ఎం.ఏసురాణి, పి.కృష్ణవేణి, సిహెచ్ మహేశ్వరి, పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

పెంచిన కరెంట్ బిల్లులు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి- కందుకూరు : కందుకూరు పట్టణం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం సుందరయ్య నగర్ ,జనార్ధన కాలనీ గిరిజన సంఘంలో సోమవారం జరిగింది. కాలనీవాసులు మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, గతంలో రూ. 200 కరెంటు బిల్లు వచ్చే ఇంటికి ఇప్పుడు రూ. 500 నుంచి రూ. 1500 వరకు వస్తుందని తెలిపారు. ఎక్కువగా వస్తున్న కరెంటు బిల్లులను తగలబెట్టి నిరసన తెలిపారు. సుందరయ్య నగర్‌లో రోడ్లు ,కాలువల సమస్య చాలా రోజుల నుండి పరిష్కారం కాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కుక్కల బెడద ఉందన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఏ గౌస్, నాయకులు ఎస్ కే మల్లికా, ఎం పద్మ ,ఎస్ పవన్ కుమార్, డి ఎం రాయుడు, టి వెంకట్రావు పాల్గొన్నారు.

3,182 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3182.520 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 571.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రైతులందరూ కూడా ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోకుండా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డిఆర్‌డిఎ పీడీ నాగరాజకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల పంట పొలాలకు నీళ్ల వదిలేందుకు లష్కర్లు లేనందున రైతులు చాలా నష్టపోతున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు ఎస్కె మహబూబ్, దుంపల సుబ్బారావు, కమలాకర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.మొత్తం 309 అర్జీలను ప్రజలు అందజేశారు. పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

డ్రెయినేజీ కాలువలు నిర్మించండి : సిపిఎం

స్థానిక 25వ డివిజన్ పరిధిలోని బుజబుజనెల్లూరు, భగత్‌సింగ్ కాలనీ ఏ,బి బ్లాకులు, వికలాంగుల కాలనీ, కళాకారుల కాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీ కలువలు నిర్మించి ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని ఆ డివిజన్ సిపిఎం శాఖ, స్థానిక ప్రజలు కలెక్టర్ ఓ ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు, సిపిఎం నాయకులు తమ ప్రాంత సమస్యను వివరించి పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భగత్ సింగ్ కాలనీ ఏర్పడి 28 సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ఈ ప్రాంతాలల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కార్పోరేషన్ సరఫరా చేస్తున్న తాగునీటిలో డ్రైనేజీ నీరు కలిసి వస్తున్నాయన్నారు. సిపిఎం నాయకులు కొండా ప్రసాద్, ఉయ్యాల శ్రీనివాసులు, కె.కృష్ణమూర్తి, మాసారం నాగూర్‌బాబు, ఎస్.వెంకయ్య, ఏ.వెంకటేశ్వరి ఉన్నారు.

కొనసాగుతున్న సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

ప్రజాశక్తి -నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోని పక్షంలో ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు చేపట్టడం తథ్యమని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అన్నారు. నగర నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం సోమవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. 5 వ డివిజన్ పరిధిలోని వైకుంఠపురం, గిరిజన కాలనీ ప్రాంతాలల్లో, 6 డివిజన్ పరిధిలోని శెట్టిగుంట రోడ్డు, సర్వేపల్లి కాలువ కట్ట, మౌలా సాహెబ్ వీధి, వై టి నాయుడు వీధి ప్రాంతాలలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌భీ ,11వ డివిజన్ పరిధిలోని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ నగర్, పల్లెపాళెం ప్రాంతాలల్లో, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 53 డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలోని వాటర్ ట్యాంకు ఏరియాలో ఆయా ప్రాంత సిపిఎం శాఖల సహకారంతో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్, శాఖా కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు బయన్న, మధు,రవి,మణి, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో..

6వ డివిజన్ ప్రాంతంలో :సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో 6వ డివిజన్ పరిధిలోని శెట్టిగుంట రోడ్డు, సర్వేపల్లి కాలువ కట్ట, మౌలా సాహెబ్ వీధి, వై టి నాయుడు వీధి ప్రాంతాలలో సిపిఎం పార్టీ బందం ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యుల అని అడిగి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరో డివిజన్లోని ప్రతి కుటుంబానికి వెళ్లి సమస్యలు అని అడిగితే సమస్యలు కోకల్లోగా ఉన్నాయన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు షేక్. మస్తాన్ బి మాట్లాడుతూ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నగర కమిటీ సభ్యులు చెంచయ్య. మూలం ప్రసాద్ రావు.పి. ధర్మాసనం. తిరుపాలు. సౌందర్య రాజన్.ఎమ్. ప్రసాద్. రవి. అహ్మద్ పాల్గొన్నారు.

కందుకూరు నుంచి నెల్లూరుకు బస్సులు నడపాలి

ప్రజాశక్తి- కందుకూరు : కందుకూరుపట్టణం నుంచి నెల్లూరుకి నేరుగా ఆర్‌టిసి బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని మూడేళ్ల కిందట నెల్లూరు జిల్లాలో కలిపిన విషయం తెలిసిందే. మూడేళ్ల కిందట కందుకూరు నెల్లూరు జిల్లాలో కలిసినప్పటికీ కందుకూరు డిపో నుంచి నేరుగా నెల్లూరుకి బస్సులు లేవు. ఉదయం 7గంటల సమయంలో కందుకూరు నుంచి తిరుపతికి ఒక సర్వీసును మాత్రమే నడుపుతున్నారు. కందుకూరు నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రమైన నెల్లూరుకి వెళ్లాలంటే ఆర్డినరీ సర్వీసులో కావలికి వెళ్లి అక్కడ నుండి నెల్లూరుకి వెళ్లాల్సి వస్తోంది. ఎక్స్ప్రెస్ సర్వీసులు లేకపోవడం వల్ల కందుకూరు నుంచి నెల్లూరుకి పోవడానికి దాదాపు మూడు గంటల సమయం పడుతుంది. సమస్య పరిష్కారానికి నెల్లూరు వరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయా ణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేకపో వడంతో ఎక్కువ మంది ప్రయా ణికులు కందుకూరు నుండి శింగరాయకొండ వెళ్లి రైళ్లల్లో ప్రయా ణిం చడానికి ప్రాధాన్య తిస్తున్నారు. దీనివల్ల సమయం వధా కావడంతో పాటు ఖర్చులు పెరుగుతు న్నాయని చెబుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమాన

ప్రజాశక్తి-నెల్లూరు : ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు వ్యర్థాలను అందజేయకుండా బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి, వారికి భారీ జరిమానాలు విధించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా 14వ డివిజన్ స్థానిక బాలాజీ నగర్, ఏ.సీ. నగర్, ద్వారకమయి నగర్, శ్రీనగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ సోమవారం పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, యస్.ఈ. రామ్మోహన్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, డి.ఈ.ఈ.లు రఘురాం, ముజా హిద్దీన్, ఏ.సి.పి. ప్రకాష్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, సర్వేయర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

అనవసరపు వ్యాఖ్యలకు స్పందించలేను..

- మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కావలి

మాజీ ఎ.ఎం.సి. చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి చేసిన అవినీతి ఆరోపణలపై తాను సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జవాబుఇచ్చారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రామిరెడ్డి పైవిధంగా స్పందించారు. రూ.లక్ష 50వేలతో బెంగుళూరుకు వెళ్లి, ఇంత ఆస్తి ఎలా సంపాదించారని అడుగగా, ఆయన స్పందిస్తూ, తాను కేవలం రూ.35వేలతోనే బెంగుళూరు వెళ్లి, కష్టపడి, వ్యాపారం చేసి, డబ్బు సంపాదించి, కళ్యాణ మండపం, ఇంజనీరింగ్ కాలేజీ, ఇంటర్ నేషనల్ స్కూల్, లాంటి ఆస్తులను రాజకీయాలలోకి రాకముందే నిర్మించానన్నారు. తన గురించి, ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఇకపై తాను మాట్లాడేది లేదని, తప్పుకుని, ప్రెస్‌మీట్ లోనుండి లేచివెళ్లిపోయారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం తహశీల్దారు వి.సుధీర్, వ్యవసాయ శాఖ అధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతున్న ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకోవడానికి గల నియమాలను వివరించారు. గతంలో 17శాతం లోపల మాత్రమే తేమశాతం ఉండాలని, నియమం ఉందని తెలిపారు. 17శాతం కంటే అదనంగా ఉంటే మరల రైతులు ధాన్యాన్ని ఆరబోసుకొని తీసుకురావాలన్నారు. ప్రయివేట్ వ్యాపారస్తులు ఒక పుట్టికి రూ.18వేలే ఇస్తున్నారని ప్రభుత్వం మాత్రం రూ.19720 చెల్లిస్తుందని తెలియజేశారు. ఈ విధంగా ప్రయివేటు వ్యాపారస్తుల చేతిలో మోసపోకుండా రైతాంగం అర్థం చేసుకొని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకొని అధిక లాభాలు పొందాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రకు సన్మానం

ప్రజాశక్తి - ఉదయగిరి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బడుగు బలహీన వర్గాల నాయకుడు బీద రవిచంద్ర యాదవ్ ఎంఎల్‌సిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రకటించడం సంతోషదాయకమని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వ్యక్తిని గుర్తించి ముఖ్యమంత్రి, యువకుల మంత్రి ఈ పదవిని ఇవ్వడంపై వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి బీద రవిచంద్ర యాదవ్‌కు సన్మానం చేసి ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

‘బీద’ను కలిసిన ఉదయగిరి నేతలు

ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నేత బీద రవిచంద్ర యాదవ్‌ను ఉదయగిరి సీతారామపురం దుత్తలూరు టిఎన్ఎస్ఎఫ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలుపెరగని నాయకుడు బీద రవిచంద్ర యాదవ్‌కు ఎంఎల్‌సి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వింజమురం శివకృష్ణ, కప్ప ప్రభాకర్ రావు, శ్రీకృష్ణ రవీంద్ర, తదితర నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి - ఉదయగిరి : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపాలెం పిహెచ్‌సి పరిధిలోని గర్భవతులకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా డాక్టర్ రాగూర్ గండిపాలెం సిహెచ్‌ఒ శివకుమార్ పాల్గొన్నారు. ఆయనతో భాగంగా గర్భవతులకు ఆహార పొట్లాలను అప్పసముద్రం హెల్త్ అసిస్టెంట్ ఎండి మస్తాన్ అలీ స్నేహితులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంగం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జనసేన కార్యకర్తలు విజయవంతం చేయాలని సూచించారు. దశాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఒడిదుడుకుల తర్వాత అధికార భాగస్వామ్యంతో పండగ వాతావరణంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామంలో జరుగు జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ఆత్మకూరు నియోజకవర్గ సంగం మండలం జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు మాలిక్ ఆనందరావు, తోట భాస్కర్, సతీష్, దినేష్, రాయల్, మణికంఠ, హేమసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : 14వ తేదీన పిఠాపురంలో జరగబోయే జనసేన ఆవిర్భావ సభ జరుగుతుందని జనసేన మండల అధ్యక్షులు పవన్ నాయక్ రహూల్ తెలిపారు. మండలంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కోర్టుల్లో కేసులను సమీక్షించాలి

ప్రజాశక్తి-కావలి : జూనియర్, సివిల్ కోర్టుల్లో కేసుల పరిధిని సమీక్షించాలని అసెంబ్లీలో కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎంఎల్‌ఎ న్యాయ వ్యవస్థలో ఎదురవుతున్న పలు ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లారు. జూనియర్ సివిల్‌కోర్టుల్లో ప్రామిసరీనోట్లు, ఇతర డాక్యుమెంట్లపై కేసులు రూ.10లక్షల వరకే తీసుకునేలా, రూ.10లక్షలకు పైగా వచ్చే కేసులు సీనియర్ సివిల్ కోర్టు పరిధిలోకి వెళ్లేలా మార్చాలని కోరారు. ఈ విధానాన్ని పొరుగు రాష్ట్రాలు అవలంభిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టుల్లో రూ.20లక్షల కేసులు వేస్తున్నందున, కేసులు ఎక్కువై సత్వరన్యాయం ఆలస్యం అవుతున్నాయన్నారు. దాంతో ఈ కేసుల పరిష్కారానికి అసాధారణ కష్టం వడ్డు వెళుతున్నట్లు గుర్తు చేశారు. కావున జూనియర్ సివిల్ జడ్జీకోర్టుల్లో రూ.10 లక్షలకేసుల పరిధి తగ్గించాలన్నారు. అంతకుమించి అయితే సీనియర్ సివిల్ కోర్టుకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సోమశిల నీటిని సముద్రం పాల్జేస్తారా..?

- గౌరవరం మేజర్ ఎఇ తీరుపై బలిజేపల్లి సూరి ప్రశ్న

ప్రజాశక్తి-కావలి : ప్రతినీటి చుక్కని ఒడిసి పట్టుకొని, సరైన రీతిలో పంటల సాగుకు వినియోగించి పంటలు పండేందుకు కృషి చేయాల్సిన అధికార విభాగంలోని నీటిని విడుదల చేసి, సముద్రం పాలు చేయడం మంచి పద్ధతి కాదని సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గౌరవరం మేజర్ పరిధిలో 20రోజుల క్రితమే వరి పంటలు కోతలకొచ్చి, ఆయనా కూడా ఇప్పటికీ గౌరవరం మేజర్‌లో సోమశిల జలాలు ఎఇ విడుదల చేశారని, గడ్డి మేపులు ఉన్న పొలాలలో ఈ నీరు పోస రైతన్నల పొలాల ఇబ్బంది కలిగించిందన్నారు. ఈ సంఘటన్లు వరి పైరు ఎదగక, పశువుల వరిగడ్డి అందడం కష్టమైన తరుణంలో, అరకొరగా ఉన్న గడ్డి కూడా నీటిపాలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేజర్ గుండా సోమశిల జలాలు సముద్రం పాలవుతున్నా అధికారులు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు రెండవ పంట గా పత్తి సాగు కోసం ఏ.ఈ. కి ముడుపులు చెల్లించారని ఆయన ఆరోపించారు. అందువలన నేటి అవసరానికి మించి గౌరవరం మేజర్ కు నీటిని ఏకం విడుదల చేశారని, ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బలిజేపల్లి విజ్ఞప్తి చేశారు.

తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చండి..

ఆత్మకూరులో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఎన్నికల హామీలలో ఇచ్చిన హామీలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఎసిఎస్‌ఆర్ కాలనీ, ఏకలవ్య నగర్ పలు ప్రాంతాలలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో 8వ తేదీ నుండి ఉగాది వరకు సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసంగా సిపిఎం ఇవాళ ఆత్మకూరు పట్టణంలోని ఎసిఎస్‌ఆర్ కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా ఈ పాదయాత్రలో వచ్చిన అనేక అంశాలు ఇక్కడ ఉండే ప్రజలకు రేషన్ కార్డులు సక్రమంగా లేకపోవడం గానీ పింఛన్లు లేకపోవడం గానీ అలాగే చాలామందికి ఇల్లు ఉన్నాయి కానీ పట్టాలు లేకపోవడం ఇలాంటి సమస్యలు తమ వద్ద చెప్పుకున్నట్లు తెలిపారు. ఇవే కాకుండా టిడ్కో గృహాల వద్ద అనేకమందికి చిన్నప్పటికి నేటికీ లబ్ధిదారులకి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి ప్రధానమైన సమస్యలు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, ఇవే కాకుండా కొంతమందికి ఆధార్ కార్డులు లేవు అనే విషయం కూడా చెప్పారన్నారు. ఒకపక్క ఈ జిల్లాలో ఉండే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే లోపు ప్రజా సమస్యల పరిష్కారం చేస్తామన్నదని తెలిపారు. సోమశిల హై లెవెల్ కెనాల్ కావాల్సిన బడ్జెట్‌లో కేటాయింపు లేదని ఒకపక్క సోమశిల అప్రాన్ గతంలో వర్షం వచ్చినప్పుడు కొట్టుకు పోయిందన్నారు. ఇప్పటికీ దానిని పూర్తి చేయలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే ఆత్మకూరు, అనంతసాగరం, ఇంజమూరు, దుత్తలూరు, ఉదయగిరి ప్రాంతాలు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అట్లాగే ప్రకాశం, కడప, వెలుగొండ ప్రాజెక్ట్ ఆరోజు ఆరోజు ప్రభుత్వం రూ.2వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిందన్నారు. కానీ బడ్జెట్లో రూ.390 కోట్ల మాత్రమే కేటాయించారని తెలిపారు. వలసలను అరికట్టేందుకు ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. మెట్ట ప్రాంతాలమైన ఈ ప్రాంతానికి పరిశ్రమలు వస్తాయని ప్రజలు ఆశతో ఉన్నారు కానీ ప్రభుత్వం దానిని నెరవేర్చడం లేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మంగలి పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, సిపిఎం నాయకులు ఆళ్ల హాజరత్తయ్య, కొండా లక్ష్మమ్మ, పద్మ, సుమతి, పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 3వ రోజు సోమవారం గుమ్మళ్లదిబ్బ వద్ద కొత్తగా వేసిన ప్రభుత్వ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు బేస్‌మట్టాలతోనే ఆగిపోయాయని నాయకులు తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ అప్పు తెచ్చుకుని బాధితులను ఇళ్ల బేస్‌మట్టాలు నిర్మాణం చేయమని ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆర్థిక స్థోమతలు లేని పేదలు అధిక వడ్డీలతో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం నుండి బిల్లులు మంజూరు కాక ఇళ్ల నిర్మాణం సక్రమంగా జరగడం లేదని, స్థానిక రాజకీయ పార్టీ పెద్దలు అధికారులు ఇళ్లు నిర్మించుకోకపోతే పట్టాలు వేరే వాళ్లకు ఇస్తామని పేదలను భయభ్రాంతులను గురి చేశారన్నారు. బిల్లులు రాక ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారందరికీ వెంటనే ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోవూరు సిపిఎం మండల పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు తిరువీధి రమేష్, బట్ట పెద్దబ్బయ్య, ఎస్.కె.అఫ్రోజ్, వవ్వేటి మల్లికార్జునరెడ్డి, ఎమ్‌డి సర్దార్, అహ్మద్, ఊటుకూరురు రమణయ్య, గండవరపు సురేష్, ఎస్‌కె చాంద్‌భాషా, ఈగ హరి, బొప్పితాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎస్‌కె.ఎస్థాని భాషా, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో..

ప్రజాశక్తి-కావలి : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై “ప్రజా చైతన్య యాత్ర” 18వ వార్డులో ముస్లిం కాలనీ, వినాయక వీధి, లంబోధర్ సెంటర్ ప్రాంతాలలో సోమవారం సిపిఎం నాయకులు ఇంటింటికి తిరిగి, ప్రజల వద్ద నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలుపుతూ కొంతమందికి ఇళ్ల స్థలాలు లేవని, పెన్షన్లు రాలేదని తెలిపారు. ముఖ్యంగా కరెంటు బిల్లులు గతంలో రూ.500 వచ్చే బిల్లు రూ.900 వరకు వస్తుందన్నారు. రూ.900 గతంలో వచ్చిన కరెంటు బిల్లు ఇప్పుడు ఇంకా ఎక్కువ వస్తుందన్నారు. రూ.300 వచ్చిన బిల్లు రూ.700 వందలు నుండి రూ.800 వరకు వస్తుందని, ఈ బిల్లులు చాలా ఎక్కువగా ఉన్నాయని కట్టలేని పరిస్థితి ఉందన్నారు. అంతేకాకుండా తమ కాలనీలో సుమారు నెల క్రితం కొన్ని ఇళ్లకు కొత్త మీటర్లు బిగించారన్నారు. ఈ మీటర్లు బిగించిన దగ్గర నుండి విపరీతమైన కరెంటు బిల్లు వేల రూపాయలు వస్తుందని, ఈ బిల్లులు చూసి ఆందోళనకు గురవుతున్నామని ఇలా ఈ బిల్లులు ఎలా కట్టగలమని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఆలోచన చేసి ఓట్లు వేసి గెలిపించారని, ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయకుండా కరెంటు బిల్లులను విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపడం ఇది చాలా అన్యాయమన్నారు. ప్రజలపై భారాలు వేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలన్నారు. శుభ్రత కలిగిన మంచినీటిని ప్రతిరోజు అందించాలని ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, జి.మధుసూదన్ రావు, కె.చెన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

మట్టెంపాడు గ్రామాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామంలో ఎలాంటి హక్కులు లేకపోయినా దొంగ పట్టాలు సృష్టించి సర్వే నెంబర్ 3లోని ఇనాం భూములను ఆక్రమిస్తున్న రాచమల్లు.రమేష్‌ను గ్రామం నుంచి ఖాళీ చేయించాలని గ్రామాన్ని కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్‌డిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ రాచమల్లు రమేష్ అనే వ్యక్తికి ఎలాంటి హక్కులు లేకపోయినా గతంలో నెల్లూరు తహశీల్దారుగా పని చేసిన ధర్మయ్య రద్దు చేసిన పట్టాలను చూపించి 15 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి మామిడి మొక్కలు నాటాడని ఇది చాలక నెల్లూరు రూరల్ తహశీల్దారు 145 సెక్షన్ పెట్టి ఉన్నప్పటికీ మరోచోట ఊర్లోకి పోయే 20 అడుగుల వెడల్పు ఉన్న దారిని ఆక్రమించి గెస్ట్ హౌస్ నిర్మిస్తూ మరో 20ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేయాలని చూస్తున్నాడని ఇది చాలా దుర్మార్గమన్నారు. కాబట్టి భూ ఆక్రమణదారుడు రాచమల్లు రమేష్‌ను అక్కడ నుంచి ఖాళీ చేయించి మట్టెంపాడు గ్రామాన్ని కాపాడాలని సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ నాయకులు కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు గుంటి నాగరాజు, గుడి రవీంద్ర శ్రీపతి వెంకయ్య, ఎన్‌వి రమణయ్య, గ్రామస్తులు చెరుకూరు రామయ్య, దువ్వూరు పెంచలయ్య, దువ్వూరు మస్తాన్, గిరిబాబు, కవిలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని భారాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

సర్వేల పేరుతో పంచాయితీ కార్యదర్శులపై అధిక భారాన్ని ప్రభుత్వం మోపుతుందని మండలం లోని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. సర్వేల పేరుతో పంచాయతీ కార్యదర్శులపై విధిస్తున్న పనిభారంపై పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపిడిఒ సుబ్రమణ్యం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో పంచాయతీ కార్యదర్శులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పండుగలకు కుటుంబంతో గడపలేని పరిస్థితి వచ్చిందని, అనారోగ్యాలకి గురవుతున్నామని తెలిపారు. తాము పంచాయితీ కార్యదర్శులుగా ఇంటి పన్ను, కొళాయి పన్ను, లైసెన్సులు, లీజు వసూళ్లు వంటి పనులు చేయవలసి ఉండగా సర్వేల పేరుతో అధికభారాన్ని మోపుతున్నారని, ప్రభుత్వం ఇకనైనా పని భారాన్ని తగ్గించాలని కోరుతున్నామన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయ మహిళా సిబ్బంది, వెలుగు కార్యాలయంలోని సిబ్బంది, కస్తూరిబా గాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్, టీచర్లు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, సిడిపిఒ, మండల పరిపాలన అధికారి, ఎంపిడిఒ తదితరులు మహిళా దినోత్సవం పురస్కరించుకొని, ఎపిఎం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడలలో పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు దుశ్శాలువాలను కప్పి బహుమతులను అందజేశారు.

అర్జీల వెల్లువ

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఓ రైతు నోషనల్ ఖాతా నెంబర్‌ను రెగ్యులర్ ఖాతాగా మార్చాలని అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, వ్యవసాయాధికారి రామ్మోహన్, హౌసింగ్ ఎఇ రవికుమార్, ఎపిఒ వెంకటరమణ, ఇరిగేషన్ ఎఇ సురేష్‌బాబు, ఆర్అండ్‌బి ఎఇ ఫయాజ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి రంగనాథపురం మున్సిపల్ స్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గోవిందమ్మ, మెప్మా ఆర్.పి. సుజాత తదితరులు పాల్గొని సావిత్రిబాయికి నివాళులర్పించారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సామాజిక న్యాయం కోసం పోరాడిన మానవతామూర్తి అన్నారు. భారతదేశంలో తొలిమహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీ విద్య కోసం పాటుపడిన మహిళా వైతాళికురాలని కొనియాడారు. డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే సామాజిక రుగ్మతలపై, సాంఘిక దురాచారాలపై పోరాడిన సంఘసంస్కర్త అని, బాల్యవివాహాలకు, సతీ సహగమనాలకు వ్యతిరేకంగా తన భర్త జ్యోతిరావు పూలేతో కలసి పోరాడిన వీరవనిత అన్నారు. ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ కులనిర్మూలనకు పాటు పడ్డారన్నారు. శూద్ర,దళిత,బహుజన, స్త్రీవిద్య కోసం పాటుపడిన మానవతామూర్తి అన్నారు.

లో ఓల్టేజీతో కాలిపోతున్న విద్యుత్ సామగ్రి

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు రామాలయం దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లో ఓల్టేజీతో తరచూ విలువైన విద్యుత్ సామాగ్రి కాలిపోతూ ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదు. దాంతో ఆదివారం ఆ పరిధిలోని పలు నివాసాలలో ఫ్యాన్లు, వాషింగ్ మిషన్‌లు సిసి కెమెరాలు వంటివి కాలి బూడిదైపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి లో ఓల్టేజ్ సమస్య లేకుండా నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

పేదవారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఐ ఆత్మకూరు నియోజకవర్గ కార్యదర్శి యామల మధు అన్నారు. సోమవారం ఆత్మకూరు టౌన్ సమితి ఆధ్వర్యంలో ఆర్‌డిఒ బి.పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఆత్మకూరు నియోజకవర్గ కార్యదర్శి యమాల మధు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయింపులు గ్రామాల్లో మూడు సెంట్లు నగరాల్లో రెండు సెంట్లు అదేవిధంగా ఇల్లు కట్టుకోవడానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించారు కానీ నేటికీ 9నెలలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటివరకు అర్హులైన వారికి ఏ ఒక్కరికి కూడా ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు దాఖలాలు లేవని విమర్శించారు. అదేవిధంగా ఇళ్ల స్థలాలు దరఖాస్తు కోసం ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతూ పంపించేస్తున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వం వైఫల్యం పేద ప్రజలకు చేస్తున్న దగా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, ఇలాగే చేస్తే కూటమి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ లేవని, చదువుకునే వారికి విద్యాదీవెన లేదని, ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేలు ఇస్తానని చెప్పిన మాటలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. కాలేజీల్లో చదివే విద్యార్థులు విద్యాదీవెన ఇవ్వకుంటే ఎలా చదవాలి యాజమాన్యం ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. టిడ్కో గృహాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. సిపిఐ ఆత్మకూరు టౌన్ కన్వీనర్ జంగం నాగరాజు, నాయకులు టీ.మాధవరావు, టీ నరసింహులు, కిష్టయ్య, చెంచయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

12న ‘యువత పోరు’

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం తెలిపేందుకు వైసిపి ఆధ్వర్యంలో 12న జిల్లా కేంద్రమైన నెల్లూరులో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ కన్వీనర్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఎస్‌సిసెల్ జిల్లా మాజీ అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో సోమవారం వైసిపి నాయకులు, యువత నాయకులు, విద్యార్థి నాయకులతో కలసి యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డితో కలసి 12న జరిగే యువత పోరు కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలసి అన్ని కలెక్టర్ కార్యాలయాలకు ర్యాలీ వెళ్లి కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామని వివరించారు. త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఎన్నికల మెనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు భృతి ఇవ్వాలని, కొత్త మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ప్రయత్నాలను ఉపసహకరించాలన్నారు. పేద విద్యార్థులకు వైద్య, విద్యను అందుబాటులో ఉంచాలన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను బయటపెడుతూ యువత పోరును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కడప జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అవధూత కాశీనాయన సత్రంలో నిత్యం అన్నదాన కార్యక్రమాలు కొనసాగు తుంటాయని, అలాంటి ఆశ్రమాన్ని కూల్చేవేసే చర్యలు కూటమి ప్రభుత్వానికి తగదని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆండ్రా సుబ్బారెడ్డి, ముతీవర్, తోడేటి మణి, కలాం, ఖాదర్ మస్తాన్, కొప్పోలు వెంకటేశ్వర్లు, పాలేటి వెంగళరెడ్డి, యువత నాయకులు నాగా సుబ్రమణ్యం రెడ్డి, గోవర్ధన్, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసం వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో సోమవారం యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 12న ఉదయం 10 గంటలకు నెల్లూరులోని వి.ఆర్.సి. సెంటర్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు జరుగు “యువత పోరు” కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : జనసేన మండల అధ్యక్షుడు టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎగ్జామ్స్‌కు ఉపయోగపడే మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, రవి, జమీర్, చదలవాడ హరీష్ కుమార్, చదలవాడ మృదుల, సంగం చిరంజీవి యువత అధ్యక్షులు భాను కిరణ్, జనసేన ఆత్మకూర్ టౌన్ నాయకులు గడ్డం వంశి, రూరల్ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పుత్తేటి వెంకట రమణారావు, తండ్రి లేట్ **లక్ష్మయ్య,** ప్రమీల నగర్, ప్లాటు నెం.67, కోవూరు గ్రామం మరియు మండలం, నెల్లూరు జిల్లా, అను నేను **తేదీ: 26-02-2025** న పడుగుపాడు, కార్తీక్ గ్యాస్ ఏజెన్సీ నుండి బైక్ మీద ఇంటికి వెళుతుండగా నా పొలం **ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం.1051/99 తేదీ: 22-11-1999,** మరియు **1618/2007 తేదీ: 29-06-2007** నెంబర్ గల డాక్యుమెంట్స్ పోయినవి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబర్లకు తెలపగలరు.

ఇట్లు
పుత్తేటి వెంకట రమణారావు, తండ్రి లేట్ **లక్ష్మయ్య,**
ప్రమీల నగర్ ప్లాటు నెం.67, కోవూరు గ్రామం
మరియు మండలం, నెల్లూరు జిల్లా,
సెల్: **9492474147, 7095599022**

In The Court of The Civil Judge, (Senior Division) Kavali.

E.A.No. 60 / 2024
E.A. 53 / 2022
E.P. 21 / 2016
K.O.S. 127 / 2011

Between :
Jilumudi Krishnareddy - Petitioner / JDR
Vs
J. Mallareddy - Respondent/DHR

To,
Sri **Jilumudi Mallareddy,**
S/o **Malakondareddy,**
D.No. 27-1-1335, Lakshminagar,
Balaji Nagar, Nellore City,
SPSR Nellore District. అనువారికి,

ఈ నంబరున పిటిషనరుమీ పై Sec. 151CPC పిటిషన్ దాఖలు చేసియున్నందుకు మీకు నోటీసు నిమిత్తం **తే.26-03-2025ది.** కి వాయిదా వేయబడి ఉన్నది. ఆదినం **పగలు 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు హాజరై, అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
పి.సునీల్ కుమార్ సింగ్,
పిటిషనర్ తరుపు న్యాయవాది, కావలి.

ఉరేసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం చెంచులక్ష్మి గ్రామానికి చెందిన రైతు బిజ్జం వెంకరెడ్డి (75)సోమవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బిట్రగుంట ఎస్ఐ బొజ్జ తెలిపారు. వివరాల మేరకు.. బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురం గ్రామంలో బిజ్జం వెంకరెడ్డి ఒక్కడే నివసిస్తున్నాడు. ఆయన భార్య సంవత్సరం క్రితం చనిపోయింది అని, ఆయనకు ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉండగా వారి దగ్గరికి పోకుండా ఒంటరిగా జీవిస్తున్నాడని ఇటీవల ఆయన ఇంట్లో పనిచేస్తున్న పనిమనిషి సూసైడ్ చేసుకొని చచ్చిపోవడంతో పిల్లల దగ్గరికి వెళ్లలేక ఒంటరి జీవితం బతకలేక ఆయన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మేజర్ పంచాయతీ పరిధిలోని యాదవపాలెంలో ప్రతీ ఇంటి గడప గడపలో చెత్త సేకరణ చేయడాన్ని మండల విస్తరణ అధికారి షేక్ నయూమ్ తాజ్ హసన్, పంచాయతీ సెక్రెటరీ జహీర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోగోలు పంచాయతీలోని ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఉండేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేశామన్నారు. ప్రజలు తడి చెత్త, పొడి చెత్త ను వేరు వేరు గా చేసి చెత్త సేకరణ వచ్చే గ్రీన్ అంబాసిడర్స్‌కు అందించాలని సూచించారు. కార్యక్రమం మండలంలోని పంచాయతీలలోని అన్నిగ్రామాల్లో అమలు పరుస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బోగోలు పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 865 / 2024

Canara Bank Formerly Known as Syndicate Bank, Dargamitta Branch, Nellore, Represented by its **Branch Manager** - Plaintiff
Vs
1. Tirunagaru Bhaskar
2. Chillpam Chinnabbi - Defendants

Notice

To,
D2. Chillpam Chinnabbi,
S/o **Tirupathaiah**
D.No. 24/1004-2, Milatery Colony,
Kondayapalem Gate, Dargamitta,
SPSR Nellore District-524003.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే18-03-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **94403 90245**

In the Court of the VIII Addl. District Judge : Nellore

O.S.No. 63 / 2024

Pachava Santhi,
Rep.by her GPA Agent
Pachava Venkata Subbaiah - Plaintiff
Vs
1. The State of Andhra Pradesh, Rep.by District Collector, Achari Street, Nellore and 17 others - Defendants

Notice to 10th Defendant

Surapaneni Krishna Chaithanya
S/o **Mallikarjuna Rao,**
Residing at Plot No.P8,
PTG Raja Towers, Rebalavari Street,
Stonehousepet, Nellore City-524002.

పై నెంబరున వాది పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 10వ ప్రతివాది అయిన మీ నోటీసు నిమిత్తం **తే27-03-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.శ్రీనివాసులు రెడ్డి, బి.ఎస్‌సి., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the VIII Addl. District Judge : Nellore

I.A.No. 75 / 2024
O.S.No. 63 / 2024

Pachava Santhi,
Rep.by her GPA Agent
Pachava Venkata Subbaiah - Petitioner/ Plaintiff
Vs
1. The State of Andhra Pradesh, Rep.by District Collector, Achari Street, Nellore and 17 others - Respondents/ Defendants

Notice to 10 th Respondent

Surapaneni Krishna Chaithanya
S/o **Mallikarjuna Rao,**
Residing at Plot No.P8,
PTG Raja Towers, Rebalavari Street,
Stonehousepet, Nellore City-524002.

పై నెంబరున పిటిషనరు/వాది పిటిషన్ షెడ్యూలులోని ‘బి’ షెడ్యూలు ఆస్తిపై టెంపరరీ ఇంజంక్షన్ కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 10వ రెస్పాండెంట్ అయిన మీ నోటీసు నిమిత్తం **తే27-03-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.శ్రీనివాసులు రెడ్డి, బి.ఎస్‌సి., బి.ఎల్.,
పిటిషనరు / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు: రూరల్ నియోజకవర్గం పరిధిలోని డైకస్ రోడ్ వెంగళరావు నగర్ ఏ బ్లాక్ చిన్న మసీధ్ వద్ద రంజాన్ మాసం సందర్భంగా పేద మహిళలు 150 మందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ కే బి చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ షేక్అల్లావుద్దీన్ నిర్వహించారు.

డయాలసిస్ మిషన్లు బహూకరణ

ప్రజాశక్తి-నెల్లూరు :జైన్ సేవాసదన్ వారి సహకారంతో భగవాన్ మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ వారి చొరవతో ఈరోజు జయభారత్ హాస్పిటల్ డయాలసిస్ విభాగానికి జైన్ సేవా సదన్ అధ్యక్షులు శ్రీ శాంతి లాల్ జెన్ జయభారత్ హాస్పి టల్ ట్రెజరర్ గుర్రం సుధాకర్‌కు అంద జేశారు. శాంతి లాల్ జైన్ మాట్లాడుతూ నెల్లూరులో జైన సమాజం అనేక సంస్థలకు చేయూతనిస్తుందని దీని ద్వారా పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు.

నైతిక విలువలతోనే మనశ్శాంతి

ప్రజాశక్తి-నెల్లూరు: నైతిక విలువలతోనే దేశం అభివృద్ధి సాధించ గలదని, మనిషి మనశ్శాంతితో జీవించ గలరని బెంగళూరుకు చెందిన బ్రహ్మయోగిని రాజయోగిని ఛాయా సిస్టర్ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పి.ఎం.పి అసోసియేషన్) ఆధ్వర్యంలో సోమ వారం, చాణక్యపురిలోని సుస్మిత నర్సింగ్ కాలేజ్ లో నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేధిస్తున్నట్లు కమిషనర్ సూర్య తేజ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్య తేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నాడు "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నూతన కమిటీ

ప్రజాశక్తి-నెల్లూరు: నెల్లూరు కాంగ్రెస్ పార్టీ నగర నూతన కమిటీ పిసిసి అధ్యక్షులు షర్మిల రెడ్డి విజయ వాడలో ప్రకటించినట్లు అధ్యక్షులు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనరల్ సెక్రెటరీ గా వావిటపర్తి సుధీర్, ఉపాధ్యక్షులుగా కే సంజయ్ కుమార్, షేక్ అల్లా బక్షు ఇర్ఫాన్, చాగంటి సుస్మిత రెడ్డి,, సెక్రటరీగా డాక్టర్ ఎన్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ నాగిరెడ్డి రాజేష్, ట్రెజరర్ గా చీపినాపి ధనుంజయ్ ఎంపికైనట్లు తెలిపారు. షర్మిల రెడ్డి పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీని నగరంలో బలోపేతం చేసేందుకు శాయ శక్తుల కషి చేస్తామన్నారు.

రైతు సేవా కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు: స్థానిక శాంతినగర్‌లోని రైతు సేవా కేంద్రాన్ని సోమ వారం ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి నిశితంగా పరిశీ లిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇప్పటివరకు ఏయే ప్రాంతాల్లో రైతులకు షెడ్యూలింగ్ ఇచ్చారు.. రైతులకు ఏయే ప్రాంతాల్లో "గోతాలు ఇచ్చారు.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలోని సిబ్బంది రైతులకు అందు బా టులో ఉండాలని సూచించారు. తేమశాతం మిషన్ ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కూటమి ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల ఆగ్రహం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల నినాదాలతో నినాదాలతో హోరెత్తింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి అంగన్వాడీలకు జీతాలు పెంచాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఇందుకూరు పేట ప్రాజెక్ట్ మండలంలోని మూడు సె క్టార్ల పేడూరు సెక్టార్ లీడర్ ఎస్. కె మస్తానమ్మ, కోడూరు సెక్టార్ లీడర్ అనిత, టిపి గూడూరు సెక్టార్ లీడర్ భాగ్యమ్మల ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ప్రాజెక్ట్ కార్యదర్శి మస్తానమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణులు , బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తు న్నార న్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టి సెంటర్ల నిర్వహిస్తున్నారని, పెరుగుతున్న ధరలకు

అనుగుణంగా 2019 సంవత్సరం నుండి అంగన్వాడీలకు వేతనం పెరగలేదని వారు ఆవేదన వ్య క్తం చేశారు. ఇదే విషయమై 2023 డిసెంబర్లో 42 రోజులు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ కాఫీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. 20వేల రూపాయలు మినిట్స్‌లో మట్టి ఖర్చులు జీఓ ఉంటే కేవలం 15 వేల రూపాయలు ఇచ్చేందుకు ఈ ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. ఇప్పటి వరకు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మారుస్తూ జిఒ ఇవ్వలేదని, మిగిలిన సమస్యలు పరిష్కారం కాలేద న్నారు. దాంతో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తమను ధర్నాకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్న కారణంగా తహశీల్దార్ ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. అంగన్వా డీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వాలని, కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడ కార్యక్రమం పిలుపునివ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పిలుపు ను నిర్వీర్యం చేయాలని, ధర్నా జరగకుండా చూడాలని ఓ పక్క సిడిపిఒలు మరోపక్క సచివాలయ సిబ్బంది పోలీసులతో అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను బెదిరింపులకు గురి చేశారని తెలిపారు. అన్ని నిర్బంధాలు ఎదుర్కొని విజయవాడలో ధర్నా విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యల పట్ల స్పందించాలని లేకపోతే ఆందోళనను ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి-కోవూరు

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సంబంధిత వైద్యులు మరింత మెరుగైన సేవలు అందించేలా దృష్టి పెట్టాలని జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్ అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయన ఆస్పత్రి వైద్యులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎల్సీడీసీ సర్వే పూర్తయిందని, 96.49 శాతంతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా 30 కేసులు గుర్తించడం జరిగిందని, వారందరికీ ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని, వీటితో పాటు ఇంట్లో ఉన్న అందరికీ పెప్ టెస్ట్ కూడా

మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్

నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల్లో గర్భిణులు, ఎయిడ్స్, డయాబిటిక్ పేషెంట్లకు తప్పని సరిగా ల్యాబ్లో పరీక్ష చేయించాలన్నారు. శరీరంపై ఏమైనా స్పర్శ లేని మచ్చలుంటే వాటిని గుర్తించి అటువంటి వారిని కూడా పరీక్ష చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, వైద్యులు డాక్టర్లు వంశీ కృష్ణ, మయుద్దీన్, గంగాధర్, తదితరులు ఉన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్వల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్లో పలు రికార్డు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సంబంధించిన ల్యాబ్ సేవలను మరింత విస్తతం చేసేలా ల్యాబ్ టెక్నీషియన్లు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు వాటిని అప్డేట్ చేసేలా ల్యాబ్ టెక్నీషియన్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్దేశించిన వేళలను పాటిస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్లు, క్షయ నివారణ అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా అన్నదాతల పరిస్థితి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కూటమి ప్రభుత్వ అసమర్ధ పాలనలో దేశానికి వెన్నెముక వంటి అన్నదాతల పరిస్థితి అధ్వానంగా మారిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన

మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

మండలంలో ప ర్యటించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ప్రస్తుత ధాన్యపు ధరలు రై తాంగానికి ఆశాజనకంగా లేదన్నారు. గతంలో ఎకరాకు సుమారు 50 వేలకు పైగా ఆదాయాన్ని సాధించిన రైతు, నేడు కనీసం రూ.20 వేలు కూడా మిగలక పోవడం ప ట్ల రైతులు ఆందోళనలో ఉన్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్యాక్టరీలకు భూములివ్వం

ప్రజాశక్తి-ఉలవపాడు: కరేడు లో అంబేద్కర్ విగ్రహం వద్ద భారత పెట్రోలియం, సోలార్ కంపెనీల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా భూములను తీసుకొని ఫ్యాక్టరీల నిర్మాణం చేసే ప్రయత్నాన్ని నిరసిస్తూ దళితులు నిరసన తెలిపారు. రైతుల దగ్గర భూములు తీసుకొని వారికి నష్టపరిహారం చెల్లిస్తే సెంటు భూమి లేని దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతుల భూముల పై ఆధారపడి జీవిస్తున్న దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ సెంటు భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్నటువంటి పరిశ్రమల వలన తీవ్ర ఇబ్బందులు గురవుతారని, చదువు లేని వారికి ఎలాంటి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఓపక్క చంద్రబాబునాయుడు ఇటీవల కందుకూరు బహిరంగ సభలో అమరావతి రైతులను ఆదర్శంగా తీసుకొని కందుకూరు నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతంలోని రైతులు పెద్ద పెద్ద కంపెనీలకు భూములు ఇవ్వాలని ప్రకటించడం దారుణమన్నారు. దర్శి ప్రాంతంలో వేలాది ఎకరాలు భూములు ఉండగా అక్కడ ఈ పరిశ్రమలను ఏర్పాటు చేయకుండా పచ్చని పంట పొలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఏమిటన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసుకుర్తి. సుబ్బారావు, దారా శ్రీని వాసులు, గంజి కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, పాలేటి సుబ్బారావు, కరేటి చిన్నయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ నిర్మలానందబాబా

పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోవూరు: కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టూరిజరం మేనేజర్ సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కోవూరు తహశీల్దార్ నిర్మలానందబాబాతో కోవూరు మండలంలో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో టూరిజం శాఖ ద్వారా బోట్ షికార్ ఏర్పాటుకు ఆ ప్రాంత నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి చొరవ చూపుతున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బోటు షికారుకు అవసరమైన ఏర్పాట్లపై పరిశీలిస్తామన్నారు. అదేవిధంగా పాటూరు పంచాయతీ చీరలకు ప్రసిద్ధి అని, ఈ ప్రాంతానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా చీరల కొనుగోలుకు వస్తారన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ సాయికిరణ్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు ఉన్నారు.

మద్యం మత్తులో తమ్ముళ్ల వీరంగం
-భయంతో వణికిపోయిన విద్యార్థులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పాఠశాలలో జరుగుతున్న సంస్క తిక కార్యక్రమంలో మద్యం మత్తులో బరితెగించి తెలుగు తమ్ముళ్ళు దౌర్జ న్యకాండ సష్టించారు. దాంతో విద్యార్థులు, ఉపాధ్యా యులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచా యతీ చెన్నపల్లిపాలెం హైస్కుల్లో సోమవారం చోటు చే సుకొంది. హెచ్ఎం సాయి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష హల్ టికెట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నత్య ప్రదర్శనలు నిర్వహించారు. అంద రూ సంతోషంగా, ఉత్సాహంగా గడుపుతున్న సమయం లో కోడూరు పంచాయతీ, వెంకటేశ్వంపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు మ త్స్యకార సంఘం అధ్యక్షుడు ఆవుల మునిరత్నం కు మారుడు ఆవుల గణేష్ ముత్యాల హరి, పామంజి వా సు, మహేష్, చందు, విజయ్, మరో పది మంది ఫుల్ గా మద్యం మత్తులో విద్యార్థులు, ఉపాధ్యా యులు, సౌండ్ సిస్టం సిబ్బందిపై అసభ్య పదజాలంతో దుర్భాషలకు ది గడమే కాకుండా భౌతికదాడులకు పాల్పడ్డాడు. ఈ హ టాత్పరిణామంతో తీవ్ర భయంతో విద్యార్థులు కేకలు వే స్తూ పరుగులు దీశారు. ఈ నేపథ్యంలో సర్ది చెప్పేందుకు వచ్చిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఫణి కుమార్ పై దా డి చేశారు. అంతేకాకుండా అసభ్యకరంగా దుషిస్తూ "ఇ ది మా ప్రభుత్వం..మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరు.. శాసన సభ్యులు సో మిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికీ చెప్పి మీ ఉద్యోగాలు పీకిచేస్తాం"..అంటూ రెచ్చిపోయారు. తె లుగు తమ్ముళ్ళ దౌర్జన్యంతో విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమం అర్ధంతరంగా ఆగిపోయింది. పిల్లలు బయం బాంత్రులు గురైపరుగులు తీశారు. జరిగిన ఘటనపై హె చ్ఎం సాయి ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేర కు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పాఠశా లలో తెలుగు తమ్ముళ్ళు చేసిన వీరంగంపై సాక్షాత్తు టీ డీపీ నాయకులే ఛీ కొడుతుండడం గమనార్హం. ఏదేమైనా బడిలో తెలుగు తమ్ముళ్ళు సష్టించిన దౌ ర్జన్యకాండ పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.